

# నేటి పత్రిక ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

Postal License No.VJ/220/2023-25



TELUGU ONLINE
DIGITAL NEWS
PORTAL &
ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి .. చదవండి.. చెప్పండి...



విజయవాడ | తేదీ : 1-7 ఏప్రిల్ 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 43 | పేజీలు : 4 | రూ. 5.00


## గవర్నర్ గిరీ చెల్లదు.. సుప్రీం సంచలన తీర్పు!

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తీరును తప్పుపడుతూ, ఆయన పెండింగులో పెట్టిన 10 బిల్లులను ఆమోదిస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. గత కొంతకాలంగా రాష్ట్రంలో ఎన్నికైన ప్రజాప్రభుత్వంతో కయ్యానికి కాలుదువ్వుతున్న గవర్నర్ రవికి సుప్రీం తీర్పుతో షాక్ ఇచ్చినట్లైంది. కేంద్ర ప్రభుత్వమే సుప్రీం అన్నట్లు డీఎంకే ప్రభుత్వానికి కంట్లో నలుసులా మారిన గవర్నర్ రవిపై తమిళనాడులో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన వ్యవహారశైలిని ప్రశ్నిస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వానికి పెద్ద ఊరట దక్కింది. దీంతో ఈ తీర్పు తమ ఒక్క రాష్ట్రానికే పరిమితం కాదని అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందని సీఎం స్టాలిన్ స్పందించారు. తమిళనాడు గవర్నర్ తీరును తప్పుపడుతూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వాగతించారు. రాష్ట్ర స్వయంప్రతిపత్తి, సమాఖ్య రాజకీయాల కోసం పోరాడుతున్న తమకు సుప్రీంకోర్టు అండగా నిలవడంపై సీఎం హర్షం ప్రకటించారు. సుప్రీం తీర్పును చారిత్రాత్మకంగా అభివర్ణించిన ముఖ్యమంత్రి, అన్ని రాష్ట్రాలకు ఊరట దక్కిందన్నారు. అసెంబ్లీ ఆమోదించిన 10కి పైగా బిల్లులను గవర్నర్ రవి తన అధికారాలతో అడ్డుకోవడం సరికాదని సుప్రీం అభిప్రాయపడింది. గవర్నర్ చర్యలు చట్ట విరుద్ధమని స్పష్టం చేసింది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లలను సవరణ కోసం తిప్పి పంపే అధికారం గవర్నరుకు ఉంటుంది. అయితే బిల్లులను తొక్కిపెట్టే అధికారం మాత్రం గవర్నర్ లకు లేదు. తమిళనాడులోనే కాదు బీజేపీయేతర పార్టీలు పాలిత రాష్ట్రాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. గతంలో తెలంగాణ గవర్నరుగా తమిళసై సౌందర్ రాజన్ ఉన్నప్పుడు ఆ రాష్ట్ర ప్రభుత్వం కోర్టును ఆశ్రయించడం గమనార్హం. ఈ నేపథ్యంలో తమిళనాడు గవర్నర్ తీరుపై సుప్పీం వెలువరించిన తీర్పు చర్చనీయాంశమవుతోంది. గవర్నర్ రవి బిల్లును నిలిపివేసిన రోజు నుంచి ఆమోదిస్తున్నట్లు సుప్రీం తీర్పునివ్వడం సంచలనంగా మారింది. తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం ఈ సంచలన తీర్పు నిచ్చింది. గవర్నర్ తీరు చట్టవిరుద్ధం, ఏకపక్షమంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. అసెంబ్లీ ఆమోదించిన కీలక బిల్లులను గవర్నర్ ఆమోదించకపోవడంతో స్టాలిన్ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. గవర్నర్ తీరును తప్పుపడుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో విచారణ జరిపిన న్యాయస్థానం గవర్నర్ ఒకసారి తిరస్కరించిన బిల్లును అసెంబ్లీ మళ్లీ ఆమోదించిన తర్వాత రెండోసారి అదే బిల్లును రాష్ట్రపతికి పంపే అధికారం గవర్నర్లకు లేదని సుప్రీం స్పష్టం చేసింది. రాష్ట్ర విశ్వ విద్యాలయాల వైస్ చాన్సలర్ల నియామకానికి సంబంధించిన బిల్లులను గవర్నర్ రవి ఆమోదించలేదు. దీనిపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు గవర్నర్ల అధికారాలపై స్పష్టత ఇచ్చింది.

## ముఖ్యంగా ఈ మూడు తగ్గిస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరవు



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : వైద్యం, ఆరోగ్యం, ఆహారం అంశంపై సీఎం చంద్రబాబు నేడు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక వ్యాధులు మన ఆహారపు అలవాట్ల కారణంగానే వస్తుంటాయని వెల్లడించారు. చాలా వ్యాధుల నివారణకు డైట్ కంట్రోల్ చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. అదెలాగో కూడా చంద్రబాబు వివరించారు. "నలుగురు సభ్యులు ఉన్న కుటుంబంలో ఉప్పు నెలకు 600 గ్రాముల మాత్రమే వాడాలి. వంట నూనె కూడా నెలకు 2 లీటర్లు మాత్రమే వాడాలి. చక్కెర కూడా నెలకు 3 కిలోలు వాడితే సరిపోతుంది. సమతుల్యమైన డైట్ తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా... ఉప్పు, వంట నూనె, చక్కెర తగ్గిస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరవు. ప్రతి రోజు అరగంట పాటు వ్యాయామం చేయాలని రాష్ట్ర ప్రజలను కోరుతున్నా. వీలైతే ప్రాణాయామం చేయాలని పిలుపునిస్తున్నా. ఇటీవల రూపొందించిన న్యూట్రిఫుల్ యాప్ కు స్కోచ్ అవార్డు లభించింది. ఈ యాప్ ను 4 లక్షల మంది డౌన్ లోడ్ చేసుకున్నారు" అని వివరించారు. కాగా, రాష్ట్రంలో పెరిగిన వైద్య ఖర్చులు, పలు రకాల జబ్బులపై ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో చంద్రబాబు వివరించారు. అమరావతిలో గ్లోబల్ మెడిసిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 100 నుంచి 300 పడకలు ఉండే ఆసుపత్రులు నెలకొల్పేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. కుప్పంలో డిజిటల్ హెల్త్ సర్వే సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. గుండె జబ్బులు, డయాబెటిస్, హైపర్ టెన్షన్, శ్వాసకోశ వ్యాధుల వంటి సమస్యలు కొన్ని చోట్ల విస్తృతంగా పెరుగుతున్నాయని సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పురుషుల కంటే మహిళల్లో అధికంగా హైపర్ టెన్షన్ కనిపిస్తోందని పేర్కొన్నారు. ఆహారపు అలవాట్ల వల్ల కొన్ని జిల్లాల్లో మధుమేహం ఎక్కువగా ఉందని వెల్లడించారు.

## వాలంటీర్ల వ్యవస్థపై పవన్ కీలక వ్యాఖ్యలు



అల్లూరి జిల్లా, నేటి పత్రిక ప్రజావార్త : ఎన్నికల సమయంలో వాలంటీర్లను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఆ దిశగా ఎలా అడుగులు వేయాలో తెలియక అయోమయంలో ఉంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తాజాగా వాలంటీర్ల వ్యవస్థపై కీలక వ్యాఖ్యలు చేశారు. అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. అక్కడ ఆయన వాలంటీర్ల సమస్యల గురించి మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం వాలంటీర్లకు సంబంధించి ఎటువంటి స్పష్టమైన విధానాన్ని అనుసరించలేదని విమర్శించారు. వాలంటీర్లకు ఒక రకమైన అయోమయ స్థితిలో ఉంచారని, వారికి ప్రభుత్వం నుంచి సరైన జీతాలు కూడా అందలేదని ఆయన ఆరోపించారు. "గత ప్రభుత్వం వాలంటీర్ల పేరుతో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి వారిని నమ్మించింది. ఈ పేరుతో ఇప్పటికే రూ. 25 వేల కోట్లు దోచుకున్నారు" అని పవన్ కళ్యాణ్ తీవ్రంగా ఆరోపించారు. ఎన్నికల ముందు వాలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన అరకు పర్యటనలో భాగంగా రెండో రోజు డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామంలోని రచ్చబండలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. వాలంటీర్ల విషయంలో వైసీపీ ప్రభుత్వం ఎలాంటి పారదర్శకత లేకుండా వ్యవహరించిందని, ఈ విషయంపై మంత్రి నారా లోకేష్‌తో కేబినెట్‌లో చర్చించడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని ఆయన అన్నారు. వాలంటీర్లకు ప్రభుత్వం నుంచి జీతాలు ఎలా అందాయో కూడా తెలియదని ఆయన పేర్కొన్నారు. "మీకు సంబంధించిన వాలంటీర్ నాయకులను జీతాలు ఎలా ఇచ్చారో అడిగి తెలుసుకోండి" అని ప్రజలకు సూచించారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి మాత్రమే కాకుండా, కేబినెట్ దృష్టికి కూడా తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వాలంటీర్లను ఒక అనిశ్చిత స్థితిలో ఉ ంచిందని ఆయన విమర్శించారు. వాలంటీర్లను తీసుకున్నది ప్రజలకు సేవ చేయడానికి అని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుతం కేబినెట్‌లో వాలంటీర్ల గురించి మాట్లాడటానికి సరైన వేదిక కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వాలంటీర్ల పేరుతో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ప్రజలను మభ్యపెట్టారని, దీని ద్వారా రూ. 25 వేల కోట్లు దోచుకున్నారని ఆయన పునరుద్ఘాటించారు. అంతేకాకుండా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు రక్తం అవసరమని, దీని కోసం సీఎస్ఆర్ నిధులు ఉపయోగించి ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, ఈ విషయాన్ని కేబినెట్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పారు. సీఎం చంద్రబాబుతో చర్చించి అంగన్‌వాడీల ద్వారా పోషక పదార్థాలు అందించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. 2018లో తాను వచ్చినప్పుడు ప్రజలు చెప్పిన సమస్యలన్నీ తనకు గుర్తున్నాయని, అందుకే మళ్లీ వచ్చానని ఆయన అన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి గురించి సీఎంకు అవగాహన ఉందని ఆయన పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చేదెన్నడు, గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్ది వాలంటీర్లకు న్యాయం చేకూరుస్తుందా లేదా అని చూడాల్సి ఉంది.

## ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కోడింగ్ పాఠాలు



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యాలను నేర్పించేందుకు ఈ-కామర్స్ దిగ్గజ సంస్థ అమెజాన్ ఏపీలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు విజయవంతంగా ముగిసింది. మూడు జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ (ఏఎఫ్ఈ) శిక్షణ అందించింది. గతేడాది దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టింది. ఈమేరకు సమగ్రశిక్ష, లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ, క్వెస్ట్ అలయన్స్ అనే స్వచ్ఛంద సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మూడు జిల్లాల్లో 248 మందికిపైగా ఉపాధ్యాయులు, 7,381 మంది విద్యార్థులకు కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతులలో నేర్పించింది.

## మోదీ అమరావతి పర్యటనకు ఏర్పాట్లు షురూ



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏపీ రాజధాని అమరావతి పర్యటనకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి మోదీ ఈ నెల మూడో వారంలో రానున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పర్యటన కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. వెలగపూడి సమీపంలోని సచివాలయం వెనుక ఉన్న 250 ఎకరాల్లో కార్యక్రమం నిర్వహించేందుకు పనులు ప్రారంభించారు. సామాన్య ప్రజలతోపాటు వీవీఐపీలు, వీఐపీల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. సభాస్థలికి చేరుకునేందుకు మొత్తం 8 మార్గాలను గుర్తించారు.

## అరకు అద్భుతమైన ప్రాంతం... దీన్ని సరిగా ఉపయోగించుకోవాలి



అరకు, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అరకు అభివృద్ధికి నడుం బిగించారు. పవన్ ఇవాళ అల్లూరి జిల్లా డుంబ్రిగుడలో 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అడవి తల్లిని నమ్ముకుంటే అన్నం పెడుతుందని, నీడనిస్తుందని అన్నారు. అరకు ఒక అద్భుతమైన ప్రాంతమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని, పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలని ఆయన ఆకాంక్షించారు. మన్యం ప్రాంతాల్లో సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గిరిజన ప్రజల జీవనశైలిని మెరుగుపరచాలని ఆయన పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి నిధులు కావాలని కోరితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి రూ. 49 కోట్లు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రహదారులకు రూ. 92 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం ఏడాదిలోపే రూ. 1,500 కోట్ల విలువైన పనులను మంజూరు చేసిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు. పవన్ తన పర్యటనలో భాగంగా పెదపాడు గ్రామంలో గిరిజనులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

## నవ్యాంధ్రలో అతిపెద్ద రైల్వేస్టేషన్..



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు చాలా డిఫరెంటుగా ఉంటాయి. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆయన తీసుకునే నిర్ణయాలు ఆశ్చర్యపరుస్తుంటాయి. ఇప్పటివరకు చంద్రబాబు దూరదృష్టితో తీసుకున్న అనేక నిర్ణయాలు సత్ఫలితాలనే ఇచ్చాయి. ప్రస్తుతం ఆంధ్రుల కలల రాజధాని అమరావతి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. నవ్యాంధ్ర రాజధానికి మణిహారంగా మరో భారీ ప్రాజెక్టును తలకెత్తుకున్నారు. అసలు రైల్వే లైనే లేని అమరావతికి ప్రత్యేక రైల్వే మార్గం వేయడంతోపాటు దేశంలో కెల్లా అతిపెద్ద రైల్వేస్టేషన్ నిర్మించాలని ప్లాన్ చేస్తున్నారు. ప్రతిపాదనల్లో ఉన్న ఈ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోందని అంటున్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో రైల్వే స్టేషన్లను అధునాతనంగా నిర్మిస్తున్నారు. తెలంగాణలో చర్లపల్లి మోడల్ టెర్మినల్ తరహాలో దేశంలో చాలా రాష్ట్రాల్లో రైల్వేస్టేషన్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం దేశంలో ప్రయాగ్ రాజ్, వారణసీ, ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ రైల్వేస్టేషన్లు అత్యంత సుందరంగా నిర్మితమయ్యాయి. అయితే వీటికి దీటుగా నవ్యాంధ్రలో అతిభారీ రైల్వేస్టేషన్ నిర్మించాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. రాజధాని అమరావతిలో నిర్మించే రైల్వేస్టేషన్ ను దేశంలోకెల్లా అతిపెద్దదిగా తీర్చిదిద్దాలని కేంద్రానికి ప్రతిపాదిస్తున్నారు. రాజధాని అమరావతి నగరానికి వెలుపల 1500 ఎకరాల్లో ఈ అతిభారీ రైల్వే స్టేషన్ కోసం భూమి అప్పగించేందుకు సీఎం సన్నాహాలు చేస్తున్నారు.

అమరావతి నగరానికి రోడ్డు, రైలు, వాయు, జల మార్గాలతో అనుసంధానించాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం. అంతేకాకుండా ఆయా మార్గాలకు ఆధునికత అద్దాలని భావిస్తున్నారు. ప్రస్తుతం రాజధాని అమరావతి పునాది దశలోనే ఉంది. కనీసం రైల్వేలైను కూడా లేదు. 2017-18లో కేంద్రం మంజూరు చేసిన రైల్వేలైన్ కాగితాల దశలోనే ఉండిపోయింది. గత ఏడాది బడ్జెట్ లో నిధులు కేటాయించడంతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పనులు పట్టాలెక్కాయి. ఖాజీపేట-విజయవాడ సెక్షన్ పరిధిలోని ఎర్రుపాలెం నుంచి విజయవాడ-గుంటూరు సెక్షన్ లోని నంబూరు వరకు 57 కిలోమీటర్ల మేర కొత్త బ్రాడ్ గేజ్ సింగిల్ రైల్వే లైనుగా నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. దీనికోసం రూ. 2,245 కోట్ల వ్యయం కానుంది. ఈ రైల్వేలైనుతో విజయవాడ, గుంటూరు, హైదరబాద్, చెన్నై నగరాలతో అమరావతి అనుసంధానం కానుంది. అమరావతి రైల్వే స్టేషన్ ను విమానాశ్రయం తరహాలో నిర్మించాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదిస్తున్నారు. దీనికోసం ముందుగా రైల్వేలైన్ నిర్మించాల్సివున్నందున ఆ పనులు వేగవంతం చేయాలని రైల్వేశాఖను కోరారు. దీంతో రెండు నెలల్లో అమరావతి రైల్వే లైనుకు టెండర్లు పిలుస్తామని రైల్వేశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి వర్తమానం పంపిందని చెబుతున్నారు. మొత్తం 56.53 కిలోమీటర్ల లైనులో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి 27 కి.మీ. మొదటి దశలో చేపట్టనున్నారు. ఈ లైనులోనే క్రిష్ణా నదిపై సుమారు మూడు కిలోమీటర్ల మేర రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడతారు.

## ట్రంప్ కు వ్యతిరేకంగా అమెరికన్ల నిరసన..



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. ట్రంప్, మస్క్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 50 రాష్ట్రాల నుంచి ప్రజలు ఈ ఆందోళనలలో పాల్గొన్నారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక జరిగిన అతిపెద్ద నిరసన కార్యక్రమం ఇదేనని అక్కడి రాజకీయ వర్గాలు తెలిపాయి. ముందుచూపు లేకుండా ట్రంప్, మస్క్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల వాణిజ్య యుద్ధాలు జరుగుతాయని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను తొలగిస్తూ మస్క్ తీసుకున్న నిర్ణయంపైనా నిరసన వ్యక్తం చేశారు. 'హ్యాండ్స్ ఆఫ్!' పేరుతో దేశవ్యాప్తంగా 1,200 పైగా ప్రదేశాలలో నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. 'ట్రంప్ గో బ్యాక్', 'హాండ్స్ ఆఫ్ డెమోక్రసీ', 'మస్క్ వాస్ నాట్ ఎలెక్టెడ్' వంటి నినాదాలతో వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్, చికాగో, మయామీ వంటి నగరాల్లోని స్టేట్ క్యాపిటల్ భవనాలు, ఫెడరల్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేస్తున్నారు. అధ్యక్షుడు ట్రంప్ అమలు చేస్తున్న వలస వ్యతిరేక విధానాలు, టారిఫ్ ల విధింపు, మస్క్ చేతిలో ప్రభుత్వ డేటా గోప్యతపై ప్రజలు తమ ఆందోళనలను కేంద్రీకరించారు.

## యువతకు ఉద్యోగాలు ఇవ్వండి: రాహుల్ గాంధీ



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : బీహార్ ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు పారిపోవద్దని, యువతకు ఉద్యోగాలు కల్పించాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. బీహార్‌లోని బెగుసరాయ్‌లో ఎన్ఎస్‌యూఐ నేషనల్ ఇన్‌ఛార్జ్ కన్హయ్య కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, బీహార్ యువతకు రాష్ట్రంలోనే ఉద్యోగాలు ఎందుకు కల్పించలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. తమ భవితవ్యాన్ని తాము తీర్చిదిద్దుకోవడానికి బీహార్ యువత సంసిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరం చివరలో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇటీవల రాష్ట్రంలోని 40 సంస్థాగత జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాలను రూపొందిస్తోంది.

## ఆ విషయంలో ట్రంప్ నుంచి మోదీ నేర్చుకోవాలి: అఖిలేశ్ యాదవ్



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : సుంకాల విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి నేర్చుకోవాలని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ సూచించారు. దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలంటే ఇతర దేశాల నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలు విధించాలని అన్నారు. లక్నోలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ, తన దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడానికి ట్రంప్ అన్ని దేశాలపై సుంకాలు విధించారని, దీనిని చూసి మన ప్రభుత్వం నేర్చుకోవాలని అన్నారు. మనం కూడా చైనాపై ఆంక్షలు విధించాలా, వద్దా అని ప్రశ్నించారు. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటుందని అన్నారు. ఉచితంగా రేషన్ పొందుతున్న వారి తలసరి ఆదాయం ఎంత ఉందో తెలుసుకుంటే అర్థమవుతుందని అఖిలేశ్ యాదవ్ అన్నారు. మన ఆర్థిక వ్యవస్థ గురించి తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఆయన విమర్శించారు. గోరఖ్‌పూర్, అయోధ్యలోని వక్ఫ్ ఆస్తులను కాజేసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయని విమర్శించారు. నేరస్థులపై యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మౌనం వహిస్తోందని అఖిలేశ్ యాదవ్ ధ్వజమెత్తారు.

## ఆయుధాలు వీడండి: మావోయిస్టులకు అమిత్ షా పిలుపు



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. ఆయన ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బస్తర్ గిరిజనుల అభివృద్ధిని మావోయిస్టులు ఆపలేరని అన్నారు. 2026 మార్చి నాటికి నక్సల్ సమస్య అంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. బస్తర్‌లో బుల్లెట్ కాల్పులు, బాంబు పేలుళ్ల రోజులు ముగిశాయని ఆయన అన్నారు. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు మనలో భాగమేనని, ఏ మావోయిస్టు చనిపోయినా ఎవరిలోనూ సంతోషం ఉండదని అన్నారు. ఆయుధాలను చేతబూని స్థానికుల, గిరిజనుల అభివృద్ధిని అడ్డుకోలేరని అన్నారు.

## నేను ఏది నమ్ముతానో అదే పాటిస్తాను: జగన్



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : వైసీపీ అధినేత జగన్ ఇవాళ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వ ఆగడాలను ధైర్యంగా ఎదుర్కొన్నారంటూ వారిని ఆయన అభినందించారు. "మిమ్మల్ని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత ఉండాలని నమ్మే వ్యక్తిని. నేను అలాగే ఉంటాను, పార్టీకూడా అలాగే ఉ ండాలని ప్రతిక్షణం ఆశిస్తున్నాను. నేను ఏది నమ్ముతానో అదే పాటిస్తాను" అని స్పష్టం చేశారు. "ఉప ఎన్నికల్లో మీరు చూసిన తెగువకు, ధైర్యానికి హాట్సాఫ్. మొత్తం 50 చోట్ల ఎన్నికలు జరిగితే, 39 స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలిచింది. కార్యకర్తలు తెగింపు చూపారు. తెలుగుదేశం పార్టీకి ఈ స్థానాల్లో ఎక్కడా గెలిచే నంబర్లు లేవు. వారికి సంఖ్యా బలం లేనే లేదు. కానీ... భయాందోళనల మధ్య ఈ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలనుకుంది. పోలీసులతో భయపెట్టి, బెదిరించారు. ఇన్ని సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నానని చెప్పుకుంటున్న చంద్రబాబుకి బుద్ధిలేదు. వాస్తవంగా ఈ ఎన్నికలను టీడీపీ వదిలేయాలి. కానీ అధికార అహంకారంతో ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చూశారు. నిజంగా ఇది ధర్మమేనా? న్యాయమేనా?" అని ప్రశ్నించారు. తిరుపతి మున్సిపల్ ఉపఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, విశాఖపట్నంలో అవిశ్వాస తీర్మానం ద్వారా అక్రమాలకు పాల్పడుతు న్నారని జగన్ ఆరోపించారు. రామగిరిలో 10కి తొమ్మిది ఎంపీటీసీ స్థానాలు వైసీపీ గెలుచుకున్నా ఎన్నికలు జరగకుండా అడ్డుకుంటున్నారని, పోలీసులే ఎంపీటీసీలను కిడ్నాప్ చేస్తున్నారని ఆయన అన్నారు. బీసీ నాయకుడు లింగమయ్యను చంపేశారని ఆరోపించారు. ప్రతి నియోజకవర్గంలో చంద్రబాబు ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని జగన్ విమర్శించారు. కుప్పంలో 16 ఎంపీటీసీ స్థానాలకు గాను 16 స్థానాలు వైసీపీ గెలుచుకుందని, అయితే ఆరుగురిని ప్రలోభాలకు గురిచేసి తీసుకెళ్లారని, మిగిలిన 9 మందిని ఎన్నికల కేంద్రానికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారని జగన్ ఆరోపించారు. కోరం లేకున్నా గెలిచినట్లు ప్రకటించుకున్నారని ఆయన విమర్శించారు. రాబోయే రోజుల్లో వైసీపీ అఖండ మెజార్టీతో గెలుస్తుందని, కార్యకర్తల కోసం కచ్చితంగా పార్టీ నిలబడుతుందని జగన్ అన్నారు. కోవిడ్ కారణంగా కార్యకర్తలకు తాను చేయాల్సింది చేయలేకపోయానని, జగన్ 2.0లో కార్యకర్తల కోసం గట్టిగా నిలబడతానని హామీ ఇచ్చారు.

## లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు... విపక్షాలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : వివాదస్పద వక్ఫ్ (సవరణ) బిల్లు ఎట్టకేలకు లోక్‌సభ ముందుకు వచ్చింది. విపక్షాల నిరసనల నడుమ బుధవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం మంత్రి రిజిజు మాట్లాడుతూ... మంత్రి మండలి ఆమోదం తర్వాతే బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినట్టు తెలిపారు. బిల్లుపై విపక్షాలు అనవసరంగా వదంతులు ప్రచారం చేశాయని ఆరోపించారు. బిల్లులో లేని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టించాయని మంత్రి విమర్శించారు. మైనారిటీల్లో అనవసర భయాలను సృష్టిస్తున్నారని, 1954లో మొదటిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. సవరణ బిల్లుతో ముస్లింలకు ఎలాంటి నష్టం ఉండబోదని కిరణ్ రిజిజు తెలిపారు. యూపీఏ అధికారంలో ఉంటే ఢిల్లీలోని కీలక స్థలాలు వక్ఫ్ సొంతం అయ్యేవని పేర్కొన్నారు. విలువైన భూములను కాంగ్రెస్ వక్ఫ్‌కు కట్టబెట్టిందని ఆరోపించారు. మసీదుల నిర్వహణపై ఈ చట్టం ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపబోదని స్పష్టం చేశారు. వక్ఫ్ చట్ట సవరణలపై ప్రజల అనుమానాలను నివృత్తి చేస్తామన్నారు.

# ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోంది: సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.. 2024-25 సంవత్సరానికి గాను మన రాష్ట్రం దేశంలోనే రెండవ అత్యధిక వృద్ధి రేటును నమోదు చేసినట్లు GolStats తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. "మన రాష్ట్రం 8.21% వృద్ధిని సాధించింది. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే మన విధానాలు ఆంధ్రప్రదేశ్‌ను సంక్షోభం నుంచి వృద్ధి పథంలోకి తీసుకెళ్లాయి. రాష్ట్రాన్ని నూతన విశ్వాసంతో ముందుకు నడిపించాయి. వ్యవసాయం, తయారీ, సేవల రంగాల్లో విస్తృత పునరుజ్జీవనం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారీ పెట్టుబడులు ఈ ప్రగతికి చోదకాలుగా నిలిచాయి. ఈ సామూహిక విజయానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ నా అభినందనలు. మనం కలసికట్టుగా కృషి చేసి మరింత ఉజ్వలమైన భవిష్యత్తును నిర్మిద్దాం" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు జాతీయ మీడియాలో ఏపీ ఘనతపై వచ్చిన కథనం క్లిప్పింగ్ ను కూడా చంద్రబాబు తన ట్వీట్ లో పంచుకున్నారు.

# ఆక్వా రంగంపై అమెరికా సుంకాల ప్రభావం తాత్కాలికమే



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు పెంచుతూ తీసుకున్న నిర్ణయం ఏపీలోని ఆక్వారంగంపై కూడా పడింది. దీనిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. ఆక్వా రంగంపై అమెరికా టారిఫ్ ల ప్రభావం తాత్కాలికమేనని అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆక్వా సమస్యలపై మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన నేడు కీలక సమావేశం జరిగింది. ఆక్వా రంగ నిపుణులు, వ్యాపారులు, అధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. అమెరికా సుంకాలు, ఆక్వా రంగానికి ఇబ్బందులపై చర్చించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఆక్వా రంగాన్ని తిరిగి గాడిన పెట్టేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. దిగుమతులపై ఆధారపడకుండా దేశీయ ఆక్వా ఉత్పత్తులను సద్వినియోగం చేసుకుందాం అని సాగుదారులకు పిలుపునిచ్చారు. రైతులు, సీడ్స్ ఉత్పత్తిదారులు, నిపుణులు, ఫీడ్ తయారీదారులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

# మీ కోసం అహర్నిశలు శ్రమిస్తా: మంత్రి నారా లోకేశ్



మంగళగిరి, నేటి పత్రిక ప్రజావార్త : మంగళగిరిని దేశంలోనే అభివృద్ధికి చిరునామాగా మారుస్తానని, నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ప్రజల సహకారం అవసరమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. 'మన ఇల్లు – మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి మండల పరిధిలోని పెనుమాక, ఉండవల్లి, ఇప్పటం ప్రజలకు యర్రబాలెం డాన్ బాస్కో స్కూలు ఆవరణలో పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, నివసిస్తున్న ప్రాంతంలోనే పట్టాలు ఇవ్వాలన్నది ఎన్నో ఏళ్ల కల అని అన్నారు. గతంలో జిరాక్స్ కాగితాలకే వేలకు వేలు ఖర్చు అయ్యేవని, ఇప్పుడు ఆ కష్టం తీరిందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ఇంటి పట్టాలు ఇస్తున్నామని తెలిపారు. మూడు రకాల భూములు ఉండగా, తొలి విడతలో 3 వేల మందికి పట్టాలు అందిస్తున్నామని, రెండో విడతలో ఎండోమెంట్, రైల్వే భూముల్లో నివసించేవారికి, మూడో విడతలో అటవీ, ఇరిగేషన్ భూముల్లో నివసించేవారికి పట్టాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 3 వేల మందికి బట్టలు పెట్టి మరీ అయిదు రోజులపాటు నిలబడి పట్టాలు ఇస్తున్నానని, ఇది ప్రజల మీద తనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని లోకేశ్ అన్నారు.

# పాంబన్ వంతెనను ప్రారంభించిన మోదీ..



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : దేశంలోనే మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సముద్ర వంతెన 'పాంబన్ బ్రిడ్జి'ని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించారు. భారత భూభాగాన్ని రామేశ్వరంతో కలుపుతూ నిర్మించిన ఈ వంతెనను మోదీ జాతికి అంకితం చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, రూ. 535 కోట్లు వెచ్చించి తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో ఈ వంతెనను నిర్మించారు. 2020లో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) పనులు చేపట్టి, నాలుగేళ్లలో పూర్తిచేసింది. సముద్రంలో 2.08 కి.మీ. పొడవున్న ఈ వంతెనపై రైళ్ల రాకపోకలు సాగించేలా, కింది నుంచి ఓడలు వెళ్లేందుకు వీలుగా వర్టికల్ లిఫ్ట్ ఉంటుంది. 2019 మార్చి 1న ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్ర మోదీ... ఆదివారం ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. మోదీ పచ్చజెండా ఊపగానే ఈ బ్రిడ్జి పైనుంచి రామేశ్వరం-తాంబరం స్పెషల్ ట్రైన్ పరుగులు తీసింది.

# శ్రీలంక నుంచి తిరిగొస్తుండగా రామసేతు దర్శన భాగ్యం కలిగింది: ప్రధాని మోదీ



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ శ్రీలంక పర్యటన ముగించుకుని, తమిళనాడు వచ్చి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీలంక నుంచి ప్రత్యేక విమానంలో భారత్ చేరుకున్న ఆయన ఓ వీడియో పంచుకున్నారు. విమానంలో వస్తూ సముద్రంలోని రామసేతును చూశానని వెల్లడించారు. కొద్దిసేపటి క్రితం శ్రీలంక నుంచి తిరిగి వస్తుండగా... రామసేతు దర్శనం చేసుకునే అదృష్టం కలిగిందని తెలిపారు. దైవికంగా, యాదృచ్ఛికంగా... అయోధ్యలో బాలరాముడికి సూర్య తిలకం జరుగుతున్న సమయంలోనే ఇది చోటుచేసుకుందని వివరించారు. ఈ రెండింటి దర్శనం చేసుకునే అదృష్టం తనకు లభించిందని హర్షం వ్యక్తం చేశారు. శ్రీరాముడు మనందరినీ ఐక్యం చేసే శక్తి... ఆయన ఆశీస్సులు ఎల్లప్పుడూ మనపై ఉండాలి అని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

# రోజా అవినీతిపై విచారణ జరుగుతోంది..



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత వైకాపా ప్రభుత్వ హయాంలో వివిధ శాఖల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై విచారణ కొనసాగుతున్న విషయం విదితమే. ఇప్పటికే గనుల శాఖ, ఎక్సైజ్ శాఖ తదితర విభాగాల్లో జరిగిన అక్రమాలపై కేసులు నమోదు చేసి ఏపీ సీఐడీ ద్వారా దర్యాప్తు చేస్తున్నారు. ఇదే క్రమంలో రోజా పర్యాటక, క్రీడా శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని తెదేపా నాయకులు ఆరోపిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో వైకాపా మహిళా నేత, మాజీ మంత్రి ఆర్కే రోజాపై తెదేపా నేత, శాప్ ఛైర్మన్ రవి నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆమె మంత్రిగా పనిచేసిన కాలంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని పేద క్రీడాకారుల డబ్బులను అప్పనంగా కాజేశారని ఆయన విమర్శించారు. నిరుపేద క్రీడాకారులకు చెందిన కోట్ల రూపాయలను రోజా దోచుకున్నారని ఆరోపించారు. ఆమె అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతోందని తెలిపారు. త్వరలో ఆమె జైలుకు వెళ్లడం ఖాయమని రవి నాయుడు అన్నారు. పొరుగు రాష్ట్రం చెన్నైలో ఉండే రోజాకు ఇక్కడి అభివృద్ధి, సంక్షేమం గురించి ఏమి తెలుసునని ఆయన మండిపడ్డారు. తిరుపతి జిల్లాలో వైకాపా నేతలు పగటి వేషగాళ్లలా తయారయ్యారని రవి నాయుడు విమర్శించారు.

# తోపుదుర్తి మాటలు విని జగన్ వస్తున్నాడు...



అనంతపురం, నేటి పత్రిక ప్రజావార్త : ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ అధినేత జగన్ రేపు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో రాప్తాడు టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పరిటాల సునీత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి మాటలు విని జగన్ వస్తున్నాడని... ఆయన హెలికాప్టర్ దిగకుండా ఆపే దమ్ము, శక్తి తమకు ఉందని అన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవను తోపుదుర్తి సోదరులు రాజకీయం చేస్తున్నారని సునీత మండిపడ్డారు. వైసీపీ కార్యకర్త లింగమయ్య మరణంపై బాధ పడిన తొలి వ్యక్తి తానేనని ఆమె చెప్పారు. లింగమయ్యను హత్య చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని అన్నారు. చనిపోయిన లింగమయ్య కుటుంబానికి సాయం చేసేందుకు తాను ముందుంటానని చెప్పారు. తోపుదుర్తి బ్రదర్స్ చెప్పిన మాటలు విని రాప్తాడు నియోజకవర్గంలో రాజకీయాలు చేయవద్దని జగన్ కు సునీత సూచించారు. గతంలో పరిటాల రవి పులివెందులకు వెళ్లినప్పుడు మీరు అడ్డుకున్నారని జగన్ పై మండిపడ్డారు. వాహనాలను ఆపేసి కేవలం మూడు వాహనాలకు మాత్రమే అనుమతిని ఇచ్చారని అన్నారు. ఒక చావును రాజకీయం చేయడానికి జగన్ ఇప్పుడు రాప్తాడుకు వస్తున్నాడని దుయ్యబట్టారు. బీసీలపై జగన్ కు అంత ప్రేమ ఉంటే... రాప్తాడు ఇంఛార్జిగా బీసీకి అవకాశం ఇవ్వాలని సవాల్ విసిరారు. జగన్ పర్యటన సందర్భంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు సహనం కోల్పోవద్దని సునీత కోరారు.

# ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా విడుదల...

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా-2025 విడుదలైంది. ఈ ఏడాది బిలియనీర్ల సంఖ్య 3,028కి చేరిందని ఫోర్బ్స్ వెల్లడించింది. గతేడాది బిలియనీర్ల సంఖ్యతో పోలిస్తే 247 మంది ఎక్కువ. ప్రపంచ బిలియనీర్ల సమష్టి సంపద 16.1 ట్రిలియన్ డాలర్లుగా పేర్కొంది. 2024తో పోలిస్తే 2 ట్రిలియన్ల డాలర్ల సంపద పెరిగిందని తెలిపింది. ఇక ర్యాంకింగ్స్‌లో అమెరికా 902 బిలియనీర్లతో అగ్రస్థానంలో ఉంటే... ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా చైనా (516), ఇండియా (205) ఉన్నాయి. ఆసియాలోనే అత్యంత సంపన్నుడు, ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ 92.5 బిలియన్ డాలర్ల సంపదతో ఈ జాబితాలో 18వ స్థానంలో నిలిచారు. మరో భారతీయుడు గౌతమ్ అదానీ 56.3 బిలియన్ డాలర్ల సంపదతో 28వ స్థానానికి పడిపోయారు. కాగా, ఈ జాబితాలో టెస్లా, స్పేస్ ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ మరోసారి తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నారు. 342 బిలియన్ డాలర్ల నికర విలువతో టాప్‌లో నిలిచారు. మస్క్ తర్వాత ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ రెండో స్థానంలో నిలిచారు. ఆయన నికర విలువ 216 బిలియన్ డాలర్లుగా ఉంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 215 బిలియన్ డాలర్ల నికర విలువతో మూడో స్థానంలో ఉన్నారు.

**టాప్-10 ప్రపంచ బిలియనీర్ల జాబితా ఇదే...**

ఎలాన్ మస్క్ (342 బిలియన్ డాలర్లు)-టెస్లా, స్పేస్‌ఎక్స్ (అమెరికా)
మార్క్ జుకర్‌బర్గ్ (216 బిలియన్ డాలర్లు)- మెటా (అమెరికా)
జెఫ్ బెజోస్ (215 బిలియన్ డాలర్లు)- అమెజాన్ (అమెరికా)
లారీ ఎల్లిసన్ (192 బిలియన్ డాలర్లు) -ఒరాకిల్ (అమెరికా)
బెర్నార్డ్ ఆర్నాల్ట్ అండ్ ఫ్యామిలీ (178 బిలియన్ డాలర్లు)-ఎల్‌వీఎంహెచ్ (ఫ్రాన్స్)
వారెన్ బఫెట్ (154 బిలియన్ డాలర్లు)- బెర్క్‌షైర్ హాత్వే (అమెరికా)
లారీ పేజ్ (144 బిలియన్ డాలర్లు)-గూగుల్ (అమెరికా)
సెర్గీ బ్రిన్ (138 బిలియన్ డాలర్లు)-గూగుల్ (అమెరికా)
అమాన్సియో ఒర్టెగా (124 బిలియన్ డాలర్లు)-జారా (స్పెయిన్)
స్టీవ్ బాల్మెర్ (118 బిలియన్ డాలర్లు)-మైక్రోసాఫ్ట్ (అమెరికా)

**జాబితాలో ఉన్న 10 మంది అత్యంత ధనవంతులైన భారతీయులు వీరే..**

ముఖేశ్ అంబానీ (92.5 బిలియన్ డాలర్లు), గౌతమ్ అదానీ (56.3 బిలియన్ డాలర్లు), సావిత్రి జిందాల్ అండ్ ఫ్యామిలీ (35.5 బిలియన్ డాలర్లు), శివ నాడార్ (34.5 బిలియన్ డాలర్లు), దిలీప్ సంఘ్వీ (24.9 బిలియన్ డాలర్లు) సైరస్ పూనావాలా (23.1 బిలియన్ డాలర్లు), కుమార్ బిర్లా (20.9 బిలియన్ డాలర్లు), లక్ష్మీ మిట్టల్ (19.2 బిలియన్ డాలర్లు), రాధాకిషన్ దమాని (15.4 బిలియన్ డాలర్లు), కుశాల్ పాల్ సింగ్ (14.5 బిలియన్ డాలర్లు)

# 14 దేశాలకు వీసాలు ఆపేసిన సౌదీ అరేబియా..

*జాబితాలో ఇండియా, పాకిస్థాన్*

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : హజ్ యాత్రకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో సౌదీ అరేబియా కీలక నిర్ణయం తీసుకుంది. 14 దేశాల పౌరులకు వీసాల జారీని తాత్కాలికంగా నిలిపివేసింది. ఉమ్రా, బిజినెస్, కుటుంబ సందర్శన తదితర కేటగిరీ వీసాలపై ఈ నిషేధం ఉంటుంది. సరైన రిజిస్ట్రేషన్ లేకుండా హజ్ యాత్రకు వస్తున్న వారిని నిలువరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సౌదీ అధికారులు తెలిపారు. గత ఏడాది హజ్ సమయంలో రిజిస్టర్ కాని యాత్రికుల వల్ల తొక్కిసలాట చోటుచేసుకుంది. గత ఏడాది హజ్ యాత్రలో పాల్గొన్నవారిలో 12 వందలకు పైగా యాత్రికులు వివిధ కారణాలతో మృతి చెందారు. రిజిస్టర్ కాని యాత్రికుల వల్ల హజ్ లో తీవ్రమైన రద్దీ ఏర్పడిందని సౌదీ అధికారులు భావిస్తున్నారు. ఇలాంటి ఘటన మరోసారి పునరావృతం కాకుండా ఉండేందుకు సౌదీ పాలకుడు ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. వివిధ వీసాల జారీని తాత్కాలికంగా నిలిపివేశారు. వీసా నిబంధనలను కూడా మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అయితే దౌత్య, నివాస ఆవాసితులు, హజ్ యాత్ర కోసం ప్రత్యేకంగా నమోదైన యాత్రికులకు ఈ నిషేధం వర్తించదు. సౌదీ వీసాలు ఆపేసిన దేశాల జాబితాలో భారత్ తో పాటు పాకిస్థాన్ కూడా ఉండటం గమనార్హం. సౌదీ ప్రభుత్వం వీసాలు నిరాకరించిన దేశాలు: ఇండియా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండొనేషియా, అల్జీరియా, జోర్డాన్, ఇరాక్, నైజీరియా, మొరాకో, సూడాన్, ట్యునీషియా, యెమెన్.

# తప్పుడు ప్రచారాలు చేస్తే సహించను... రెడ్ బుక్ లోకి ఎక్కిస్తా: మంత్రి లోకేశ్



కనిగిరి, నేటి పత్రిక ప్రజావార్త : సీఎం చంద్రబాబునాయుడు చెప్పిన పీ4 విధానానికి రిలయన్స్ సీబీజీ ప్లాంట్స్ నాంది కాబోతున్నాయని, పేదరికం లేకుండా చేయడంలో ఇదొక ముఖ్యమైన అడుగు కాబోతోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పిసిపల్లి మండలం దివాకరపురంలో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యాన ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటుకు మంత్రి లోకేశ్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ప్రసంగించారు.

**నైపర్ గడ్డితో గ్యాస్..** ఎటువంటి నీటివసతి లేని మెట్టప్రాంతంలోని రైతులకు ఈ ప్లాంట్స్ ద్వారా పెద్ద ఎత్తున మేలు జరుగుతుంది. నైపర్ గడ్డితో గ్యాస్ తయారు చెయ్యబోతున్నారు. ప్రభుత్వ భూములకు 15 వేలు, రైతుల భూములకు రూ. 31 వేలు కౌలు కూడా ఇవ్వబోతున్నారు. రైతులే గడ్డి పెంచి ఇస్తే టన్నుకు నిర్ణీత ధర చెల్లిస్తారు. రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లన్నీ పూర్తిస్థాయిలో పనిచేస్తే ఏటా 110 లక్షల మెట్రిక్ టన్నుల ఆర్గానిక్ ఎరువు కూడా తయారు అవుతుంది. ఈ ప్లాంట్ల ద్వారా గ్రామీణ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు రాబోతున్నాయి. నేను ప్రకాశం జిల్లా వచ్చిన ప్రతీ సారి మీరు చూపించే ప్రేమ, ఆప్యాయత నేను మర్చిపోలేను. ప్రకాశం జిల్లాలో పేదరికం లేకుండా చెయ్యడమే మా లక్ష్యం. రానున్న అయిదేళ్లలో ఆ లక్ష్యాన్ని సాధించి తీరుతాం.

**సీబీజీ హబ్ గా మారనున్న కనిగిరి..** ఏపీలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్స్ పెట్టడానికి రిలయన్స్ ముందుకు వచ్చింది. ఈ రంగంలో 65 వేల కోట్ల పెట్టుబడి పెట్టబోతోంది. దీని ద్వారా 500 ప్లాంట్లు పెట్టడానికి రిలయన్స్ ముందుకు వచ్చింది. తద్వారా 2.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయి. ప్రకాశం, అనంతపురం, చిత్తూరు, కడపలో 5 లక్షల ఎకరాల బీడు భూమిని వినియోగంలోకి తీసుకురాబోతున్నాం. నేను యువగళం ప్రకాశం జిల్లాకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాను. రిలయన్స్ మొదటి సీబీజీ ప్లాంట్ ను కనిగిరిలో ప్రారంభించాను. ప్రకాశం జిల్లాలో ఐదు వేల ఎకరాలు బీడు భూములు ఇచ్చాం. కనిగిరిలో 497 ఎకరాలు కేటాయించాం. కనిగిరి ప్లాంట్ రిలయన్స్ సీబీజీ ప్లాంట్ హబ్ గా మారబోతుంది. ఇక్కడే ఐదు ప్లాంట్స్ రాబోతున్నాయి.

**ప్రకాశం జిల్లా నా గుండెల్లో ఉంటుంది..** ఉమ్మడి ప్రకాశం జిల్లా అంటే నాకు మొదట గుర్తొచ్చేది పౌరుషం, ప్రేమ. ఇక్కడి ప్రజలకు పౌరుషం ఎక్కువే, ప్రేమ ఎక్కువే. ప్రకాశం జిల్లా ప్రజలకు టీడీపీ అన్నా, చంద్రబాబు అన్నా ఎనలేని ప్రేమ. 2019లో ఎదురుగాలి ఉన్నా టీడీపీని నాలుగు సీట్లలో గెలిపించారు. 2024 లో 10 సీట్లలో టీడీపీ అభ్యర్థులకు ఘన విజయాన్ని చేకూర్చారు. యువగళం పాదయాత్ర చేసినప్పుడు ఇక్కడ ప్రజల కష్టాలు చూశాను. ప్రకాశం జిల్లాలో యువగళం ఒక ప్రభంజనంగా మారింది. నేను ఆ రోజే చెప్పా, మీరు చూపించిన ప్రేమకు రెండింతలు తిరిగి ఇస్తానని. ప్రకాశం జిల్లా నా గుండెల్లో ఉంటుంది అని. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. కట్టు బట్టలతో మనం ప్రయాణం ప్రారంభించాం. అందరి ఆమోదంతో అమరావతిని రాజధానిగా ప్రకటించాం. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ఎజెండాగా పనిచేశాం. అనంతపురంను ఆటోమొబైల్ హబ్ చేశాం. చిత్తూరు, కడపలో ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీలు తీసుకొచ్చాం. కర్నూలుకు రెన్యూవబుల్ ఎనర్జీ కంపెనీలు తీసుకొచ్చాం. ప్రకాశం జిల్లాకు అతిపెద్ద పేపర్ మిల్ తీసుకొస్తే ఆ కంపెనీని గత ప్రభుత్వం రానివ్వలేదు. ఉభయగోదావరి జిల్లాలను ఆక్వా రంగంలో నంబర్-1గా నిలబెట్టాం. ఉత్తరాంధ్రను ఐటీ, ఫార్మా హబ్ గా తయారు చేశాం.

**గత అయిదేళ్ల పాలనంతా విధ్వంసమే!..** 2019 నుంచి 2024 వరకూ ఎం జరిగిందో మీరంతా చూశారు. రాష్ట్రంలో విధ్వంస పాలన నడిచింది. కొత్త కంపెనీలు తీసుకురాకపోగా ఉన్న కంపెనీలను తరిమేశారు. లులూ, అమర్ రాజా, హెచ్ఎస్బీసీ, జాకీ లాంటి అనేక కంపెనీలను బెదిరించి బయటకు పంపేశారు. నేను ఆ రోజే ఛాలెంజ్ చేశా... మీరు తెచ్చిన ఒక్క కంపెనీ పేరు చెప్పండి అని. ఇప్పటి వరకూ ఆ సైడ్ నుంచి సౌండ్ లేదు. దేశంలో ఏ పార్టీ చేయని సాహసం మేం చేశాం. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం అని చెప్పిన దమ్మున్న పార్టీ టీడీపీ. ఆ హామీ ఇచ్చే నేను అనేక మందితో మాట్లాడాను. అందరూ నీ ధైర్యం ఏంటి అని అడిగారు. నా ధైర్యం ఒక్కటే... నా బ్రాండ్ ఒక్కటే దటీజ్ సీబీఎన్ అని చెప్పా. 2024లో సైకో పాలనకు బైబై చెప్పి రాష్ట్ర ప్రజలు ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గెలిచిన మొదటి రోజు నుంచే ఉద్యోగాల వేట మొదలుపెట్టాం. యువగళం పాదయాత్ర నాలో మార్పు తెచ్చింది. జీడీ నెల్లూరు నియోజకవర్గంలో పాదయాత్ర సమయంలో ఒక కుగ్రామంలో ఒక తల్లి రోడ్డుపై బోండాలు వేస్తోంది. ఆకలివేస్తోంది, బోండాలు పెట్టమని అడిగా. ఆమెను ఏం కావాలని అడిగాను. మద్యానికి బానిసై నా భర్త చనిపోయాడు, 30ఏళ్లుగా టిఫిన్ కొట్టుపెట్టుకుని జీవనం సాగిస్తున్నా. ఇద్దరు బిడ్డలను చదివిస్తున్నా, వారికి ఉద్యోగాలు కావాలని కోరింది. మరుసటిరోజే సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి మ్యానిఫెస్టోలో మొదటిహామీగా 20 లక్షల ఉద్యోగాలు పెట్టాలని కోరాను.

**సీబీఎన్ బ్రాండే మా ధైర్యం!..** మొన్నే ఢిల్లీలో ఒక ఇంటర్వ్యూ కి వెళ్లా. అక్కడ యాంకర్ ఒక ప్రశ్న అడిగారు. తెలంగాణకు హైదరాబాద్ ఉంది, తమిళనాడుకి చెన్నై ఉంది, కర్ణాటక కు బెంగుళూరు ఉంది. ఆంధ్రప్రదేశ్ కు ఏమి ఉంది అని అడిగారు. నేను ఆయనకు ఆంధ్రప్రదేశ్ కు చంద్రబాబు ఉన్నారని చెప్పా. ఇప్పటికే 8 లక్షల కోట్ల పెట్టుబడులు, వాటి ద్వారా 5 లక్షల ఉద్యోగాలు కల్పించడానికి ఒప్పందాలు చేసుకున్నాం. రిలయన్స్, ఎన్‌టీపీసీ, ఆర్సీలార్ మిట్టల్, బీపీసీఎల్, టాటా పవర్, టీసీఎస్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్. ఇలా అనేక కంపెనీలు రాష్ట్రానికి క్యూకట్టాయి. నా లక్ష్యం ఒక్కటే కుటుంబంలో ఒక్క ఉద్యోగం వస్తే ఆ కుటుంబం పరిస్థితులు మారిపోతాయి. పేదరికం లేకుండా చేయ్యాలి అంటే ఉద్యోగాలు కల్పించాలి. 5 ఏళ్లలో రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే నా టార్గెట్.

**రిలయన్స్ తో బాబుకు ప్రత్యేకమైన అనుబంధం..** రిలయన్స్ ఫౌండర్ ఛైర్మన్ ధీరూభాయ్ అంబానీతో చంద్రబాబుకు మంచి అనుబంధం ఉంది. జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ రిఫైనరీ చూడటానికి వెళ్ళినప్పుడు చంద్రబాబు టెలికాం రంగంలో విప్లవం రాబోతుంది అని ధీరూభాయ్ అంబానీతో చెప్పారు. చంద్రబాబుపై నమ్మకంతో ఆ రోజుల్లోనే ధీరూభాయ్ అంబానీ టెలికాం రంగంలో పెట్టుబడులు పెట్టారు. ఆ తరువాత ఆ అనుబంధం రిలయన్స్ ఛైర్మన్ ముకేశ్ అంబానీతో కూడా కొనసాగుతుంది. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత నేను ముకేశ్ అంబానీని, అనంత్ అంబానీని, రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్ ని కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించాను. ఏపీ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు... స్పీడ్ ఆఫ్ డూయింగ్ లో ముందుందని చెప్పాను. 21 రోజుల్లో ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ (ఐస్ ) తీసుకొస్తానని హామీ ఇచ్చాను. కానీ 30 రోజులు పట్టింది. అడిగిన వెంటనే ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడానికి అంగీకరించిన ముకేశ్ అంబానీ, అనంత్ అంబానీ, రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్ కు మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

**కనిగిరి ట్రిపుల్ ఐటీకి త్వరలోనే శంకుస్థాపన..** ప్రకాశం జిల్లాలో ఎప్పుడు వచ్చినా నా పాదయాత్ర గుర్తొస్తుంది. నాపై చూపిన ప్రేమ, అభిమానం ఎప్పుడూ మర్చిపోను. కనిగిరిలో ట్రిపుల్ ఐటీకి త్వరలోనే శంకుస్థాపన చేస్తా. కనిగిరి రైల్వే ప్రాజెక్టుకు ఏప్రిల్ లో అవసరమైన నిధులిస్తాం. ఆగస్టులో సీఎంను రప్పించి రైల్వేప్రాజెక్టు పనులు ప్రారంభిస్తాం. మిగిలిపోయిన వెలుగొండ పనులు పూర్తిచేసి చివరి ఎకరాకు సైతం సాగునీరు అందిస్తాం. తాగునీటి శాఖ మంత్రి, నా సోదరుడు పవనన్న కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించి ఆగిపోయిన జల్ జీవన్ మిషన్ పనులను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ప్రతిగడపకు తాగునీరు అందిస్తాం. వైసీపీ నాయకుల దుష్ప్రచారం చూస్తుంటే జాలివేస్తోంది. వారు చేయరు, చేసేవాళ్లను చేయనీయరు. బయోగ్యాస్ ప్లాంటుపై అపోహలు సృష్టిస్తున్నారు. అనవసరంగా అడ్డుపడితే ఎర్రబుక్ లోకి ఎక్కుతారు. నేను మంచి పనిచేయడానికి వచ్చా. అధికారంలోకి వచ్చిన 10నెలల్లోనే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుతో ప్రకాశం జిల్లాకు వచ్చా. తప్పుడు ప్రచారం చేస్తే ఎవరినీ వదిలిపెట్టను. ఆనాడు బీసీ గర్జన పేరుతో మేం ప్రకాశం జిల్లాలో కార్యక్రమం పెడితే ఉదయభాను యాంకర్ గా వచ్చారు. ఆనాడు బీసీ సోదరులపై దాడులను నిలదీశాం. ఉదయభానును ట్రోల్ చేశారు. బీసీ నేతలపై దొంగ కేసులు పెట్టారు. నాపై కూడా 23 కేసులు పెట్టారు. తగ్గేదే లేదని చెప్పాను. 94 శాతం సీట్లతో మీరు మమ్మల్ని గెలిపించారు. మీకు అండగా నిలుస్తాం.

**కనిగిరి నియోజకవర్గంలోనే 50 ప్లాంట్లు..** పాదయాత్ర సమయంలో సాయంత్రం సరదాగా కూర్చుని మాట్లాడుకునేవాళ్లం. మన ప్రాంతంలో ఏం మార్పుతేవాలనే విషయమై చర్చించేవాళ్లం. మా ప్రాంతంలో వలసలకు చెక్ పెట్టాలని ఉగ్ర నరసింహారెడ్డి చెప్పారు. అది గుర్తుపెట్టుకొని నేను, గొట్టిపాటి మొదటి సీబీజీ ప్లాంట్ కనిగిరిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. రిలయన్స్ ఆధ్వర్యాన మొదటి వంద సీబీజీ ప్లాంట్లు ప్రకాశం జిల్లాకు తేవాలని నిర్ణయించాం. ఈ ప్రాంత రైతులు 50 వేల ఎకరాలు కౌలుకు ఇస్తారని ఉగ్ర చెప్పారు. చెప్పిన ప్రకారం భూములిస్తే ఇక్కడే 50 ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం. గత పదిరోజులుగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అవిశ్రాంతంగా పని చేశారు. కనిగిరి ప్రజల కోసం ఆయన కష్టపడ్డారు. ఇక్కడ ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఇక్కడే ఉద్యోగాలు కల్పించాలని ఆయన కృషి చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, ఆనం రాంనారాయణ రెడ్డి, డోలా బాల వీరాంజనేయ స్వామి, చీఫ్ సెక్రటరీ విజయానంద్, ప్రకాశంజిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా, ట్రాన్స్ కో ఎండి కీర్తి చేకూరి, ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, కందుల నారాయణరెడ్డి, బిఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, ఎంఎం కొండయ్య, ఏలూరి సాంబశివరావు, కాకర్ల సురేశ్, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్, అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, యర్రగొండపాలెం ఇన్ ఛార్జి ఎరిక్షన్ బాబు, దర్శి ఇన్ ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్, ఆర్ఐఎల్ మెంటర్ పీపీఎల్ మాధవరావు, రిలయన్స్ బయో ఎనర్జీ సీఈఓ హరీంద్ర కే త్రిపాఠి, నెడ్ క్యాప్ వీసీ అండ్ ఎండీ కమలాకర్ బాబు, సర్పంచ్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# జగన్-షర్మిల మధ్య కుదిరిన ఒప్పందం క్లియర్‌గా ఉంది...



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఆస్తుల పంపకానికి సంబంధించి వైసీపీ అధినేత జగన్ పై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల అనవసర ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ వేంపల్లి సతీశ్ రెడ్డి విమర్శించారు. డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే ఆమెను సీఎం చంద్రబాబు తెరపైకి తీసుకొచ్చారని అన్నారు. షర్మిల చెబుతున్న ఆస్తులు దర్యాప్తు సంస్థల ఆధీనంలో ఉన్నాయని చెప్పారు. ఆ ఆస్తుల ఆస్తులు ఇవ్వలేదని షర్మిల అంటున్నారని సతీశ్ రెడ్డి విమర్శించారు. జగన్, షర్మిల మధ్య కుదిరిన ఒప్పందం క్లియర్ గా ఉందని చెప్పారు. టీడీపీ గ్రాఫ్ రోజురోజుకు పడిపోతోందని... ప్రజలను దాన్నుంచి డైవర్ట్ చేయడానికి షర్మిలను చంద్రబాబు తెరపైకి తెచ్చారని విమర్శించారు. చంద్రబాబుకు మేలు చేసేందుకే షర్మిల... జగన్ పై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.

# నిత్యానంద స్వామి చనిపోలేదట...



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు నిత్యానంద స్వామి జీవ సమాధి అయినట్లు మంగళవారం నాడు ఆయన మేనల్లుడు సుందరేశ్వర్ వెల్లడించినట్లు వార్తలు వ్యాపించిన విషయం తెలిసిందే. ఈ వార్త నిన్న నెట్టింట బాగా హల్‌చల్ చేసింది. ఇక ఈ వార్తతో ఆయన భక్తులు, అనుచరులు శోక సంద్రంలో మునిగిపోయారు. అయితే, నిత్యానంద చనిపోలేదని ఆయన ప్రకటించుకున్న కైలాస దేశం తాజాగా ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఆయన సురక్షితంగా, చురుకుగా ఉన్నట్లు వెల్లడించింది. అంతేగాక నిత్యానంద బతికే ఉన్నాడని రుజువుగా మార్చి 30న ఆయన ఉగాది వేడుకల్లో పాల్గొన్న ప్రత్యక్ష ప్రసార లింక్‌ను తన ప్రకటనకు కైలాస దేశం జత చేసింది. దురుద్దేశపూరితంగానే కొందరు ఇలాంటి ప్రచారం చేస్తున్నారని తన ప్రకటనలో పేర్కొంది. ఇక 2019లో అత్యాచార ఆరోపణలతో దేశం విడిచి పారిపోయిన నిత్యానంద దక్షిణ అమెరికాలోని ఈక్వెడార్ సమీపంలో ఓ దీవిని సొంతం చేసుకుని దానికి కైలాస దేశంగా నామకరణం చేశారు. ఇప్పుడు అక్కడే ఉంటున్నారు.

# గొప్ప మనసు చాటుకున్న అనంత్ అంబానీ..



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : బిలియనీర్ ముఖేశ్ అంబానీ కుమారుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ డైరెక్టర్ అనంత్ అంబానీ గుజరాత్‌లోని జామ్‌నగర్ నుంచి ద్వారకకు పాదయాత్రగా వెళుతున్న విషయం తెలిసిందే. ఈ రెండు నగరాల మధ్య ఉన్న దూరం 140 కిలోమీటర్లు కాలినడక సాగిస్తున్నారు. ఏప్రిల్ 10న తన పుట్టిన రోజు నాటికి అనంత్ ద్వారకకు చేరుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఇక తన వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడకూడదనే ఉద్దేశంతో భారీ భద్రత మధ్య రాత్రివేళ పాదయాత్ర చేస్తున్నారు. కాగా, తన పాదయాత్రలో అనంత్ అంబానీ తాజాగా గొప్ప మనసు చాటుకున్నారు. వందలాది కోళ్లను ఆయన రక్షించారు. కంభాలియా ప్రాంతంలో ఓ కోళ్ల వ్యాన్‌ను చూసి చలించిపోయారు. వెంటనే ఆ కోళ్లను వదిలేయాలని, ఇందుకు తాను రెండు రెట్లు డబ్బులు చెల్లిస్తానని యజమానికి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియోను చూసిన నెటిజన్లు జంతువుల పట్ల అనంత్ అంబానీకి ఉన్న ప్రేమను కొనియాడుతున్నారు. కాగా, ద్వారకాధీశుడి ఆశీర్వాదం కోసమే తాను ఈ పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# మహాత్మాగాంధీ ముని మనవరాలి కన్నుమూత



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : మహాత్మా గాంధీ మునిమనవరాలు నీలమ్‌బెన్ పరీఖ్ కన్నుమూశారు. ఆమె వయసు 93 సంవత్సరాలు. మహాత్మా గాంధీ కుమారుడు హరిదాస్ గాంధీ మనవరాలి కుమార్తె అయిన నీలమ్‌బెన్ నిన్న గుజరాత్‌లోని నవ్‌సిరిలో తుదిశ్వాస విడిచారు. నీలమ్‌బెన్ నవ్‌సిరిలో కుమారుడు డాక్టర్ సమీర్ పరీఖ్ వద్ద ఉంటున్నారు. ఈ ఉదయం 8 గంటలకు ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. నీలమ్‌బెన్ మహాత్మాగాంధీ బాటలోనే నడిచారు. ఆమె తన జీవితాన్ని 'వ్యారా' (సేవ)కి అంకితం చేశారు. జీవితం మొత్తం మహిళా సంక్షేమం, మానవ సంక్షేమం కోసం పనిచేశారు.

## నగరంలో ఆంధ్రప్రదేశ్ ఆల్ బ్యాంకు గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ సమావేశం



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలో ఆంధ్ర ప్రదేశ్ ఆల్ బ్యాంకు గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ (ఎబిజిఎయు రిజిస్టర్ నెంబర్ ఎఫ్-227) ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విజయవాడ వివిధ బ్యాంకులలో జరుగుతున్న నకిలీ బంగారం పెట్టి రుణాలు మోసాలు చేస్తున్న దొంగలను ఏ విధంగా అడ్డుకట్ట వేయాలని మరలా పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేలా జాగ్రత్తల గురించి సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదరాడ శ్రీనివాస్ మాట్లాడుతూ యూనియన్ తరపున ఇప్పటివరకు జరిగిన నకిలీ బంగారం సంఘటనలు ఎలా జరుగుతున్నాయో తెలియజేశారు. ఈ విషయాన్ని మోసాలను అన్ని బ్యాంకుల రీజనల్ ఆఫీసులకు వెళ్లి అధికారులకు వివరించాలని, బ్యాంకులలో హెచ్చరిక నోటీసులను పెట్టాలని, ఉద్దేశ పూర్వకంగా నకిలీ బంగారం తెచ్చిన వ్యక్తిపై బ్యాంకు వైపు నుండి వెంటనే కఠినమైన చర్యలను తీసుకొనే విధముగా అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేయాలని, ఇదే అంశంపై వినతిపత్రాన్ని సమర్పించే కార్యక్రమం చేయాలని సమావేశంలో నిర్ణయించామని తెలిపారు. ఈ విషయాన్ని వివిధ బ్యాంకుల అప్రైజర్స్ లీడర్స్‌కు తెలియపరచడం జరుగుతుంది అని, తప్పకుండా వారి రీజనల్ ఆఫీసులకు వెళ్లి వినతిపత్రం ఇవ్వాలని,ఆయా బ్యాంకులకు చెందిన అప్రైజర్లను కాపాడుకోవాల్సిన బాధ్యత లీడర్స్‌గా ఉన్న ప్రతీ ఒకరిపై ఉందని చెప్పారు.

ఎబిజిఎయు యూనియన్ నాయకులు జనరల్ సెక్రటరీ ఈదరాడ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు వేల్పూరి కోటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస చక్రవర్తి, కోశాధికారి తాళాబత్తుల నరేంద్రకుమార్, వైస్ ప్రెసిడెంట్ టి.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆకోజు ఏడుకొండలు, వివిధ బ్యాంకులకు చెందిన అప్రైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాకు రక్షణ కల్పించండి...



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : రాజకీయంగా తన ఎదుగుదల చూసి ఓర్వలేక స్థానికంగా ఉండే కొంతమంది నాయకులు తనపై తన కుటుంబ సభ్యులపై దాడులకు పాల్పడుతున్నారని విజయవాడ-54వ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ హర్షద్, వారి భార్య అబ్దుల్ సుమయా ఆరోపించారు. బుధవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్లో 54వ-డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ హర్షద్, న్యాయవాది షేక్ అన్వర్ తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. రంజాన్ పండుగ రోజున పంజా సెంటర్ లో హలీం దుకాణాల వద్ద తన కుటుంబ సభ్యులపై సయ్యద్ సలీమ్, సయ్యద్ అనాజ్, సలారు అలియాస్ బబ్లూ, నిజామ్, ఆటోనగర్ అనాజ్, చోటు అలియాస్ ఇడ్లీ బౌన్సర్, నయీమ్, నూర్, ఎమ్ఐఎం సమీర్, సల్మాన్ బాబా, రకీబ్, జాహేదా, సులేమాన్ అనే వ్యక్తులు మరి కొంతమందితో కలిసి దాడులకు పాల్పడ్డారన్నారు. అదేరోజు మూడు ప్రాంతాల్లో కావాలని పథకం ప్రకారం తమపై దాడులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం పోలీసుల సమక్షంలో కూడా దాడి చేశారన్నారు. తమ కుటుంబ సభ్యులపై హత్యాయత్నం చేసిన వారిపై పోలీసులు 307 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వైకాపాలో కార్పొరేటర్ గా గెలిచినా ప్రస్తుతం తాను తెలుగుదేశం పార్టీలో ఉన్నానని హర్షద్ అన్నారు. రాజకీయంగా తన ఎదుగుదలను చూసి ఓర్వలేక కొంతమంది స్థానిక నాయ కులు పథకం ప్రకారం దాడులకు పాల్పడు తున్నారన్నారు. తమకు తమ కుటుంబ సభ్యులకు పోలీసులు రక్షణ కల్పించాల న్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. తక్షణమే పోలీసులు చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించాలని కోరారు. పోలీసు అధికారులు ఈ ఘటనపై నిష్పక్ష పాతంగా విచారణ జరిపి న్యాయం చేయాల అన్నారు. గతంలో కూడా ఈ దాడిలో పాల్గొన్న వ్యక్తులే తమను టార్గెట్ చేసి దాడి చేయడానికి కూడా ప్రయత్నించారని ఆరోపించారు. తానులేని సమయంలో తన కుటుంబ సభ్యులపై దాడి చేయడం ఎంత వరకు సబబని 54వ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ హర్షద్ ప్రశ్నించారు? న్యాయవాది షేక్ అన్వర్ తమ కుటుంబ సభ్యులకు సహకరిస్తున్నారని, ఆయనపై దాడి చేయడానికి ఈ ఘటనలో పాల్గొన్న నిందితులు ప్రయత్నిస్తున్నారని కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు అందచేశామని తెలిపారు. అనంతరం న్యాయవాది షేక్ అన్వర్ మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ లేకపోవడం బాధాకరమని అన్నారు. న్యాయవాదులకు రక్షణ చట్టం కోరకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అబ్దుల్ హర్షద్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### జమిలి ఎన్నికలపై బీజేపీ నాయకుల వాదనల్లో నిజం లేదు: తులసిరెడ్డి



కడప, నేటి పత్రిక ప్రజావార్త : జమిలి ఎన్నికల విషయంలో బీజేపీ నాయకులు చేస్తున్న వాదనల్లో నిజం లేదని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణ చేసి దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించాలనే మోదీ ప్రభుత్వ నిర్ణయం దురదృష్టకరమన్నారు. కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిన్న ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలు నిర్వహించాలనుకోవడం పిచ్చి తుగ్లక్ చర్య అని విమర్శించారు. జమిలి ఎన్నికల ద్వారా కలిగే ప్రయోజనాలను ముందుగా దేశ ప్రజలకు చెప్పాలని బీజేపీ చీఫ్ నడ్డా అనడం విడ్డూరంగా ఉందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే ఐదు రాజ్యాంగ సవరణలు అవసరమని పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణ చేసేంతటి మెజారిటీ ప్రస్తుత లోక్‌సభ, రాజ్యసభలో ఎన్డీయే ప్రభుత్వానికి లేదని తెలిపారు. జమిలి ఎన్నికల వల్ల ఖర్చు తగ్గుతుందని బీజేపీ నాయకులు చెప్పడంలో నిజం లేదన్నారు. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' నినాదం నియంతృత్వానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు. అదే జరిగితే ఎన్నికలు లేని దేశం స్థాయికి భారత్ చేరుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి జమిలి ఎన్నికల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

## శరీరతత్వాన్ని బట్టి డైట్‌తో ఆరోగ్యం...

**- డాక్టర్ మాకాల సత్యనారాయణ**



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలోని అశోక్ నగర్ ఇండియన్ ఓం కేంద్ర కార్యాలయము వద్ద 'డైట్ మరియు ప్రాణశక్తి' అనే అంశము మీద ఒకరోజు శిక్షణ ది. 06-04-2025 ఆదివారం ఉదయం పది గంటల నుండి సాయంకాలం ఐదు గంటల వరకు ఇవ్వబడుతుంది అని 'యోగ శక్తి సాధన సమితి 'వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. మానవ దేహంలో నాలుగు తత్వాలను సంతరించుకుంటుందని అవి 1 చలువ తత్వం 2 అతి చలవతత్వం 3 వేడి తత్వం 4 అతి వేడి తత్వం అని తత్వాన్ని బట్టి ఆహారంతో ఆరోగ్యం పెరుగుతుందని డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. ఈ శిక్షణలో 1 అనారోగ్య కారణాలు 2 ప్రాణశక్తి మార్గాలు3 అమృతాహారం 4 విషాహారం 5 చలువ తత్వాహారం 6 వేడితత్వాహారం 7 ఆమ్లతత్వాహారం 8 క్షారతత్వ ఆహారం ల గూర్చి తెలిపి ఎవరి తత్వాన్ని బట్టి వాళ్ళు ఆహారం ఎంచుకోవడం మరియు సమయపాలన గురించి తెలియజేసి అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవడానికి ఈ శిక్షణ ఉపకరిస్తుందని తెలిపారు. ఈ శిక్షణలో చేరగోరు వారు సెల్ నెంబర్ 9000347469 సంప్రదించి పేరు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

## పాపన్న మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించిన జై గౌడ సేన నాయకులు



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ పట్టణంలో బందర్‌లాకుల సెంటర్లో గౌడ సోదరులు ఏర్పాటు చేసిన పాపన్న మహారాజ్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని గౌడ మహనీయులు మొట్టమొదటి బహుజన రాజ్యాధికార స్ఫూర్తి ప్రధాత శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్‌కు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న జాతీయ అధ్యక్షులు డాక్టర్ మోర్ల ఏడుకొండలు గౌడ్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా పాపన్న మహారాజ్ భావజాలం గడప గడపకు ప్రచారం చేయడంలో ముందు వరుసలో పని చేస్తూన్నాము అని గత 8 సంవత్సరాలుగా ఆయన జయంతికి పాపన్న ముఖంచిత్రంతో ముద్రించిన కండువాలు జెండాలు రెండు తెలుగు రాష్ట్రాలకు ఉచ్చితంగా అందిస్తున్నామని ఈ సంవత్సరం కూడా ఆగష్టు 18 నిర్వహించే పాపన్న జయంతి కార్యక్రమంకు జెండాలు, కండువాలు ఉచ్చితంగా అందించడం జరుగుతుంది అని అయన భావజాలం బహుజన కులాల నాయకులు గుర్తించి రాజ్యాధికారం దిశగా అడుగులు వేసి రెండు తెలుగు రాష్ట్రాలలో బహుజన రాజ్యం సాదించాలి అని పిలుపు నీచ్చారు. తెలంగాణా గౌరవ అధ్యక్షులు పల్లె వెంకటేష్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ యూవజన కార్యదర్శి పడమటి బాలసాయి గౌడ్, పల్నాడు బ్రహ్మం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ధనికులు పేదలను ఉద్ధరిస్తారా?

**-పీ4 పథకంపై బీఎస్పీ ఏపీ సమన్వయకర్త పూర్ణచంద్రరావు ధ్వజం**



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ఇప్పటికి నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన పాలనాకాలంలో ధనికులు మరింత ధనికులు, పేదలు మరింత పేదలు అయ్యార తప్ప మరేమీ ఒరగలేదని బీఎస్పీ ఏపీ సమన్వయకర్త, మాజీ డీజీపీ డాక్టర్ పూర్ణచంద్రరావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టినట్లు చెబుతున్న పీ4 పథకంపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. విజయవాడలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. "చంద్రబాబు నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయ్యి ఏం సాధించినట్లు? ఆయన కుటుంబం ధనవంతులు కావడానికి, ఆయన కుమారుడు మంత్రి కావడానికే ఉపయోగపడినట్లు కనిపిస్తోంది. ప్రజలకు ఏమీ పనికిరాలేదు. ఆయన నాలుగుసార్లు సీఎం అయినా ప్రజలు ఇప్పటికీ ఎందుకు వెనకబడే ఉంటున్నారు? అసలు రాజకీయాలతో డబ్బు సంపాదించాల్సిన పని లేకుండా హెరిటేజ్ పెట్టుకున్నట్లు ఆయన చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు ఏపీలో ఒక్కో నియోజక వర్గానికి రూ.10 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఖర్చుపెట్టారు. ఆ డబ్బంతా ఎక్కడినుంచి తెచ్చారు? టీడీపీ ఖజానా నుంచి ఏమైనా ఇచ్చారా? ఆ కిటుకులేవో బీసీ, ఎస్సీ, ఎస్టీ ముస్లిం ప్రజలు నేర్చుకోవాలి. చంద్రబాబు రాజకీయాల్లో డబ్బు సంపాదించి, అధికారాన్ని హస్తగతం ఎలా చేసుకుంటున్నారో తెలుసుకోవాలి. పదేపదే ప్రతిసారీ బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలను కించపరిచేలా మాట్లాడవద్దు. మీరు చెప్పేవి, చేసేవన్నీ ప్రచారం కోసమేనని అందరికీ తెలుసు. మీరు గతంలో ప్రవేశపెట్టిన జన్మభూమి, శ్రమదానం, క్లీన్ అండ్ గ్రీన్, నీరు-చెట్టు లాంటి కార్యక్రమాలతో ఏం లాభం వచ్చింది? మన దగ్గర బీసీ, ఎస్సీ, ఎస్టీల తలసరి ఆదాయం రూ.70 వేలకు మించి లేదు. అంటే ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయి. కానీ రోజుకో మాట పూటకో ప్రచారంతో మీరు కాలం గడిపేస్తున్నారు. మేఘా కృష్ణారెడ్డికి ఎక్కడి నుంచి అన్ని డబ్బులొచ్చాయి? ఏపీ, తెలంగాణ నుంచి ఆయనకు ఎన్ని వేల కోట్ల కాంట్రాక్టులు ఇచ్చారు? వాటి నుంచి పర్సంటేజిలు ఏయే ముఖ్యమంత్రికి ఎన్ని వెళ్లాయో శ్వేతపత్రం విడుదల చేయగలరా? పర్సంటేజి ఎంత 6 శాతమా? 10 శాతమా? అసలు ఈ దత్తత తీసుకోవడం ఏంటి? ఈ రాష్ట్రాన్ని బాగు చేయాలని ప్రజలు మీకు అధికారం ఇచ్చారు. దాన్ని వదిలేసి వాళ్లకు, వీళ్లకు దత్తత ఇవ్వడమేంటి? జగన్ వైఫల్యం వల్ల మీరు అధికారంలోకి వచ్చారు. ఇప్పటికైనా మీరు ప్రచారార్భాటం, పిచ్చిమాటలు మానుకోండి. బడుగు, బలహీనవర్గాలను కించపరచడం మానుకోండి. ఏమైనా అంటే బరోడా మహారాజు గురించి చెబుతారు. ఆయన వల్ల ఎంతమంది అంబేడ్కర్‌లు అయ్యారో చెప్పమనండి? బ్రాహ్మణ గురువు వల్లే అబ్దుల్ కలాం గొప్పవారయ్యారని అంటున్నారు. మరి ఆ గురువు చదువు చెప్పినవారిలో ఎంతమంది కలాంలు అయ్యారు? ఎవరైనా మేధస్సు, అకుంఠిదీక్ష ఉండి కూడా.. అంటరానితనం వల్ల బాధలు అనుభవించి, మనసులో అగ్ని రగిలి, గుండె పగిలితే ఒక అంబేడ్కర్ పుడతాడు. కానీ మీరు చెప్పేదంతా చాలా విచిత్రంగా ఉంటోంది. గ్రామాల్లో ఎవరైనా అమ్మాయి మీద అత్యాచారం చేస్తే.. అలా చేసినవాడికే ఇచ్చి పిల్లను కట్టబెడతారు. అలాంటి సంస్కృతి ఈ దేశంలో ఉంది. ఈ మనువాద సంస్కృతి దేశాన్ని ఎంత దగా చేసిందంటే.. ఈ పేదలు, బలహీన వర్గాల వాళ్లను ధనికులు బాగు చేయడం ఏంటి? ఇది ప్రజల దేశం తప్ప ధనికుల దేశం కాదు. అదానీలు, అంబానీలు, జిందాల్ లాంటివాళ్లను మీరు పెంచి పోషిస్తున్నారు. ఈ తరహా రాజకీయాలకు ఇకనైనా స్వస్తి పలకండి" అని డాక్టర్ పూర్ణచంద్రరావు సూచించారు.

## విజయవాడలో చంద్రన్న వజ్రోత్సవ వేడుకలు



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర వాణిజ్య మండలి చంద్రన్న వజ్రోత్సవ వేడుకలు సంయుక్తంగా పీఎంకేఎం ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 16 నుండి 20 వ తేదీ వరకు నాటికి పోటీలో సాంస్కృతిక కార్యక్రమాలు కూచిపూడి నృత్య ప్రదర్శనలు జానపద నృత్య పోటీలు నిర్వహించి ఏప్రిల్ 20వ తేదీ వరకు చంద్రన్న వజ్రోత్సవ వేడుకలు నిర్వహించుచున్నారు. గురువారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పసుపులేటి వెంకటరమణ ఆధ్వర్యంలో విజయవాడ గాంధీనగర్ కందుకూరి కళ్యాణ మండపం నందు ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు ఏ ఎమ్ రత్నం ప్రధాన కార్యదర్శి మోహన్ గౌడ సంయుక్తంగా కలిసి పిఎంకెఎం ఫైన్ ఆర్ట్స్ మరియు సిఫా అధ్యక్షులు వెంకటరమణ పసుపులేటి ఆధ్వర్యంలో కనివిని ఎరుగని రీతిలో ఘనంగా కార్యక్రమం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. గతంలో నాడు 2000 సంవత్సరంలో స్వర్ణోత్సవ వేడుకలు నేడు 2025 వజ్రోత్సవ వేడుకలు నిర్వహించుచున్న ఒకే ఒక్కడు సిని దర్శకులు వెంకటరమణ పసుపులేటి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమృత వర్షిణి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొండిశెట్టి సురేష్ బాబు, అశోక్ కొప్పుల, బొర్రా నర్సయ్య, సయ్యద్ జాఫర్, డీ రామ్ బాబు, ఎన్ వి లక్ష్మీ దేవి, సీనియర్ ఆర్టిస్ట్ సీనియర్ జర్నలిస్టు ప్రజా నాట్య మండలి ఎన్ టి ఆర్ జిల్లా అధ్యక్షులు జి వి రంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రయోజనాల కోసం ఓటర్ ప్రోగ్రెస్ కార్డ్ మరియు ఇండియా ఓటర్స్ యాప్ అమలు చేయాలి...

**-ప్రజా ప్రయోజన వ్యాజ్యం దరఖాస్తుదారుడు అళహరి వెంకటేశ్వర్లు**



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రతి ఎన్నికల్లో 80% ఓటర్లు నమోదుకు ఓటర్ ప్రోగ్రెస్ కార్డ్ మరియు ఇండియా ఓటర్స్ యాప్ అమలు, ఎన్నికల కోడ్ అమలు నుండి రాజకీయ నాయకులు విగ్ర హాలకు నిషేధం విధించినట్లుగా మద్యం నిషేధించాలని ప్రజా ప్రయోజన వ్యాజ్యం దరఖాస్తుదారుడు అళహరి వెంకటేశ్వర్లు ఈసీ అమలు చేయాలనీ కోరారు. బుధవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్లో జరిగిన విలేకరుల సమావేశంలో అళహరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హై స్కూల్ స్థాయి నుండి ఓటు హక్కు వినియోగంపై పాఠ్యాంశం వలన 5% ఓట్లు అదనంగా పెరుగుతుందని రాజకీయ నాయకులు విగ్రహాలకు ఎన్నికల కోడ్ ప్రారంభం నుండి నిషే ధిస్తూ ఉన్నారు. అలానే ఎన్నికల కోడ్ అమలు నుండి మద్యం నిషేధించడం వలన 5% ఓట్లు అదనంగా నమోదు అవుతాయని, ఓటరు ఓటు హక్కు వినియోగించుకుంటారని అన్నారు. సెల్ ఫోన్ ద్వారా సందేశం పంపించే పద్ధతులు వలన 5% ఓట్లు అదనంగా నమోదవుతాయని జమిలి ఎన్నికల బిల్లులో ఫోటో వినియోగించుకున్న ఓటర్లకు గుర్తింపు, గౌరవం, ఇచ్చే అంశాలు లేవు, అందువలన జమిలి ఎన్నికల బిల్లుకు పరిపూర్ణత చేకూర లేదని కాబట్టి జెమినీ ఎన్నికలు బిల్లుపై ప్రజా సేకరణ ఈ అంశాలు చేర్చవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. జమిలి ఎన్నికలు బిల్లుపై చేర్చాల్సిన ప్రజా అభిప్రాయం సేకరణలో నేను పాల్గొని వాటర్ ప్రోగ్రెస్ కార్డ్ మరియు ఇండియా ఓటర్స్ యాప్ గురించి తెలియ చేశానని, ఈ అంశాలు ఆ ప్రజా సేకరణ జరగాలని మీడియా ద్వారా చర్చ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. 2018 సంవత్సరంలో ఉపరాష్ట్రపతి కి ఓటర్ ప్రోగ్రెస్ కార్డు వివరాలు తెలియజేశానని, ఎన్నికల కమిషన్ పంపించారని అన్నారు. ఓటు వేసిన ఓటర్లకు పెట్టే సిరా గుర్తు 2 నెలలకు చెరిగిపోతుంది. స్థిరమైన, శాశ్వతమైన, అధికారిక ధ్రువీకరణ గుర్తింపు ఓటు వేసిన ఓటర్లకు అందజేసే చర్యలు భారత దేశంలో ఇప్పుడు వరకు చేపట్టలేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వి.ఎల్.ఎన్.ప్రసాద్, కె.వెంకు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై హీరో సుమన్ సంచలన వ్యాఖ్యలు



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి, తెలంగాణలో బిల్లును తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజమైన హీరో అని సినీ నటుడు సుమన్ ప్రశంసించారు. బీసీ రిజర్వేషన్లపై సందేహాలు వ్యక్తమైన తరుణంలో అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేసిన ఘనత రేవంత్ రెడ్డిదేనని కొనియాడారు. తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే బిల్లుకు ఆమోదం లభించడం సంతోషకరమని ఆయన అన్నారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న బీసీల పోరు గర్జన సభకు సుమన్ సంఘీభావం తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. బీసీలంతా రేవంత్ రెడ్డికి మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని బీసీలు, గొడ్లకు ఎస్టీ హోదా ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. చాలా కాలంగా ఈ డిమాండ్ ఉన్నప్పటికీ గత ప్రభుత్వాలు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని సుమన్ అన్నారు. ఈ డిమాండ్ ను నెరవేరిస్తే సీఎం రేవంత్ రెడ్డి తమ పాలిట దేవుడుగా మారతారని సుమన్ చెప్పుకొచ్చారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి సుమన్ విజ్ఞప్తి చేశారు.

### బాలీవుడ్ పై విజయ్ దేవరకొండ సంచలన వ్యాఖ్యలు



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : కొన్నేళ్లుగా బాలీవుడ్ తన ప్రాభవాన్ని కోల్పోతూ వస్తోంది. చెప్పుకోదగ్గ గొప్ప సినిమాలను బాలీవుడ్ అందించలేకపోతోంది. బాలీవుడ్ స్టార్లు కూడా పెద్ద హిట్లను సాధించలేక పోతున్నారు. ఇదే సమయంలో దక్షిణాది సినిమాలు ఉత్తరాదిని ఊపేస్తున్నాయి. ఈ క్రమంలో బాలీవుడ్ పై సొంత ఇండస్ట్రీలోని ప్రముఖులు కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ బాలీవుడ్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్ ఇప్పుడు ఇబ్బందులను ఎదుర్కొంటోందని.. త్వరలోనే పూర్వ వైభవాన్ని సాధిస్తుందని చెప్పారు. దక్షిణాది సినిమాలకు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. తెలుగు సినీ పరిశ్రమ ఈ స్థాయికి చేరుకోవడం వెనుక ఎంతో మంది శ్రమ, కృషి ఉందని చెప్పారు. ఒకానొక సమయంలో మన సినిమాలకు ఉత్తరాదిన సరైన గుర్తింపు ఉండేది కాదని అన్నారు. బాలీవుడ్ లో ఇప్పుడు ఒక లోటు ఏర్పడిందని... ఆ లోటును కొత్త దర్శకులు తీరుస్తారని చెప్పారు. కాకపోతే ఆ దర్శకులు ముంబైకి సంబంధం లేకుండా బయటివారే అయి ఉంటారని అనిపిస్తోందని అన్నారు.

## వక్ఫ్ ఆస్తులను "స్వాధీనం చేసుకోవడం, నాశనం చేయడం"...

**-ముస్లిం సమీక్ష వేదిక అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్**



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింల సంక్షేమం కోసం కాదని, వారి వారసత్వాన్ని, ఉనికిని నాశనం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని ముస్లిం సమీక్ష వేదిక అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్ రహీం ఖాన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్,ముస్లింలు క్షమించరని చెప్పారు.మత సంస్థలను నిర్వహించే కమిటీలలో హిందువులు మాత్రమే సభ్యులు కాగలరని, మరి ముస్లిమేతరులు వక్ఫ్ బోర్డులో ఎలా సభ్యులు కాగలరని ప్రశ్నించారు. ఐదు కోట్ల మంది ముస్లింలు బిల్లుకు వ్యతిరేకంగా ఉమ్మడి కమిటీకి ఇమెయిల్‌లు పంపినప్పటికీ, ముస్లిం పర్సనల్ లా బోర్డు, ప్రముఖ జాతీయ, రాష్ట్ర స్థాయి ముస్లిం సంస్థలు, కీలక వ్యక్తుల విస్తృత ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ, ప్రభుత్వం తన వైఖరిని పునఃపరిశీలించడానికి నిరాకరించడమే కాకుండా బిల్లును "మరింత వివాదాస్పదంగా మార్చిందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను "స్వాధీనం చేసుకోవడం, నాశనం చేయడం" అనే దాని ఎజెండాకు కట్టుబడి ఉందని అబ్దుల్ కటీఫ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నూరాన్, రహీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## స్వతంత్రం వచ్చి 77 ఏళ్లయిన క్షేత్రస్థాయిలో పరిష్కారాల శూన్యం

**-వాయిస్ ఫర్ చేంజ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ అల్లు వెంకటేశ్వర్లు..**



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రభుత్వ అధికారుల వ్యవస్థ ప్రకటనలు మాత్రమే చేస్తోందని క్షేత్రస్థాయిలో పరిష్కారాలు జరగటం లేదని వాయిస్ ఫర్ చేంజ్ గౌరవ అధ్యక్షుడు అల్లు వెంకటేశ్వర్ విమర్శించారు వాయిస్ ఫర్ చేంజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీ నగర్ స్థానిక ప్రెస్‌క్లబ్లో మంగళవారం మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఫౌండేషన్ అధ్యక్షులు అల్లు వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి77 ఏళ్ల తర్వాత కూడా సమాజాన్ని అనేక సమస్యలు పట్టి పీడిస్తున్నాయన్నారు ముఖ్యంగా భూ సంబంధమైనటువంటి సమస్యలు అనేకం ఉన్నాయన్నారు వాటిని అధికారులు కానీ ప్రజాప్రతినిధులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు దేవాలయ భూములు అన్యాక్రాంతమైన వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు లేవన్నారు అవినీతిని నిరోధించి అందరికీ విద్యా, వైద్యం ఉచితంగా అందించడం ద్వారా సమాజ అభివృద్ధి చేయవచ్చు అన్నారు అందుకు తగ్గట్టుగా ప్రభుత్వాలు చట్టాలను రూపొందించి సమాజాభివృద్ధికి తోడ్పడాలన్నారు. 276037 సున్నా ఖాతాలు ఉన్నాయని 22a భూముల అంశం పట్టాభూముల వివరాల ట్యాంపరింగ్ తదితర అంశాలు సమస్యాత్మకంగా కొనసాగుతున్నాయన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన రైతులకు భూ సమస్యలు పరిష్కరించి పాస్ బుక్స్ ఇచ్చే అంశం దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉండిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు స్వతంత్రం వచ్చి 77 ఏళ్ళైనా వందల కోట్ల విలువైన దేవాలయాల భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతిలో చిక్కుకునే ఉన్నాయని సంబంధిత అధికారులు చట్టాల్లో ఉన్న లోపాల ఆసరాగా కబ్జాదారులపై చర్యలు తీసుకోవటం లేదన్నారు అవినీతి పరులైన రాజకీయ నాయకులు ప్రజలని ఉచిత పథకాల హామీలతో సోమరి పోతులుగా మారుస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ లో కొత్త ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ కొత్త రేషన్ కార్డ్ ఇచ్చే ప్రక్రియ ఇంకా పట్టా లెక్కలేదని పి4 లో విద్య వైద్యం ఉచితంగా ఇస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని వెంకటేశ్వర్ ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో విరవల్లి రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అది తప్ప నేనేం పట్టించుకోను: నాని



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : విజయాల పరంపర కొనసాగిస్తున్న తాను సక్సెస్ ఫుల్ డైరెక్టర్లతోనే చేయొచ్చు, అయితే పరాజయాలు ఎదుర్కొంటున్న దర్శకులతోనూ నటించానని హీరో నాని అన్నారు. కథ నచ్చితే చాలు, మిగతా విషయాలను పట్టించుకోనని ఆయన స్పష్టం చేశారు. హీరోగా, నిర్మాతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాని, ప్రస్తుతం కథానాయకుడిగా హిట్ 3, ది ప్యారడైజ్ సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీవల ఆయన కోర్ట్ మూవీని నిర్మించిన విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాల గురించి మాట్లాడారు. కథల ఎంపిక విషయంలో తన నిర్ణయాలు చూసి చాలామంది ఆశ్చర్యపోయేవారని అన్నారు. కథల ఎంపికకు ప్రత్యేకంగా ఫార్ములా ఏమీ లేదని, ప్రేక్షకుల కోణంలోంచి చూస్తానని తెలిపారు. తాను నిర్మించిన కోర్ట్ మూవీని థియేటర్‌లో చూడటానికి ఎవరూ రారని, ఇది ఓటీటీ సినిమా అని చాలామంది అన్నారని గుర్తు చేశారు. చిన్న సినిమాలను థియేటర్లలో చూసేందుకు ఎవరు వస్తారని చాలామంది ప్రశ్నించారని, తన కార్యాలయంలో పనిచేసేవారు సైతం సందేహాలు వ్యక్తం చేశారని నాని అన్నారు. అయితే ఎడిటింగ్ రూమ్‌లో సినిమా చూసిన వెంటనే ఇది బ్లాక్‌బస్టర్ అవుతుందని చెప్పానని ఆయన గుర్తు చేసుకున్నారు.

## ఎవరు తీసుకుపోయేది ఏమీలేదు: గాయని ఎల్ ఆర్ ఈశ్వరి!



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : 1960 - 80 మధ్య కాలంలో గాయనిగా ఎల్.ఆర్.ఈశ్వరి 5 భాషలలో అనేక పాటలు పాడారు. జ్యోతిలక్ష్మి, జయమాలిని, సిల్క్‌స్మిత. ఇలా అనేక మంది శృంగార తారలకు సంబంధించిన పాటలను ఎక్కువగా పాడారు. తాజాగా 'సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తనకి సంబంధించిన అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. "నేను పుట్టిపెరిగింది చెన్నైలోనే. నా 8వ ఏట మా ఫాదర్ చనిపోయారు. కోరస్ పాటల ద్వారా వచ్చిన డబ్బుతో మా అమ్మగారు ఇల్లు నడిపేది" అని అన్నారు. "బాలుగారితో కలిసి చాలా పాటలు పాడాను. బాలు చాలా కష్టపడి పైకొచ్చారు. పెద్దవాళ్లను గౌరవించడం ఆయనకి బాగా తెలుసు. ఎక్కడ కనిపించినా చాలా ఆత్మీయంగా పలకరించేవారు సరదాగా మాట్లాడేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే బాలు బంగారం అంతే. ఆయన లేరు అనే మాటనే నేను ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. ఇక లేడీ సింగర్స్ తో కలిసి పాడిన పాటలు కూడా ఉన్నాయి. అయితే ఎవరూ ఎవరినీ మెచ్చుకునేవారు కాదు. ఎవరి పోర్షన్ వారు పాడుకుని వెళ్లిపోయేవాళ్లం" అని చెప్పారు. "నా మొదటి పాటకి ఇచ్చిన పారితోషికం 300. ఆ పారితోషికం వెయ్యి రూపాయలు కావడానికి చాలా కాలం పట్టింది. నేను అభిమానించే గాయనీమణులలో వాణీ జయరాం ఒకరు. 19 భాషలపై ఆమెకి పట్టు ఉంది. అలాంటి ఆమె హఠాత్తుగా అలా చనిపోతారని ఎవరూ ఊహించలేదు. మనం సాధించినది .. సంపాదించినది మరొకరికి ఉపయోగపడాలనే స్వభావం నాది. పోతూ పోతూ ఎవరు తీసుకుపోయేది ఏమీలేదు... అందువల్లనే నేను సంపాదించినది పంచడం జరిగిపోయింది. లైఫ్ హ్యాపీగానే సాగిపోతోంది" అని చెప్పారు.

## పెట్టింది 20 కోట్లు... కానీ వచ్చింది 5 కోట్ల చిల్లరే!



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : తమిళంలో హీరోగా జీవీ ప్రకాశ్ కుమార్ కి మంచి క్రేజ్ ఉంది. ఒక వైపున హీరోగా... మరో వైపున సంగీత దర్శకుడిగా బిజీగా ఉన్నాడు. అప్పుడప్పుడు నిర్మాతల జాబితాలో కూడా ఆయన పేరు కనిపిస్తోంది. ఆయన నుంచి ఇటీవల వచ్చిన సినిమానే 'కింగ్ స్టన్'. అడ్వెంచర్ తో కూడిన ఫాంటసీ హారర్ మూవీ ఇది. కమల్ ప్రకాశ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకి జీవీ ప్రకాశ్ కుమార్ కూడా ఒక నిర్మాతగా ఉన్నాడు. మార్చి 7వ తేదీన థియేటర్లకు ఈ సినిమా వచ్చింది. అయితే ఆశించినస్థాయిలో ఆడియన్స్ కి ఈ సినిమా కనెక్ట్ కాలేదు. 20 కోట్ల బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమా, 5.35 కోట్లను మాత్రమే రాబట్టగలిగింది. దీనిని బట్టి పెద్ద మొత్తంలోనే నష్టాలు తెచ్చిపెట్టిందనే విషయం అర్థమవుతూనే ఉంది. అలాంటి ఈ సినిమా ఈ నెల 4వ తేదీ నుంచి, నాలుగు భాషల్లో 'జీ 5'లో స్ట్రీమింగ్ కానున్నట్టుగా తెలుస్తోంది. దివ్యభారతి, నితిన్ సత్య, అళగమ్ పెరుమాళ్, చేతన్ ముఖ్యమైన పాత్రలలో కనిపించనున్నారు. కథ విషయానికి వస్తే... అది సముద్రతీరంలోని ఒక జాలరి గూడెం. కొంతకాలంగా చేపల వేటకి వెళ్లినవారెవరూ వెనుతిరిగి రారు. ఆ సముద్రంపై చనిపోయిన ఒక వ్యక్తి ఆత్మ అందుకు కారణమనే ప్రచారం జరుగుతూ ఉంటుంది. మళ్లీ అందరూ పనిలోకి వెళ్లాలంటే, ఆ ప్రచారంలో నిజం లేదని నిరూపించాలి. అందుకోసం బయల్దేరిన హీరో ఎలాంటి సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుంది? అనేది కథ.

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt. Ltd., D.No:33-5-9, Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published from H.No:24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line Cross, VIJAYAWADA 520 003, Krishna District, Andhra Pradesh.
Editor : Konduri Srinivasarao, RNI Title code No : APTEL 2021/80559, Phone No : 9948877444, Email id : konduri9999@gmail.com.